సాక్షి
వైఎస్‌ఆర్ జిల్లా
గురువారం । 12 । జూన్ । 2025



హౌసింగ్ బోర్డు చోరీ కేసులో పురోగతి

ప్రొద్దుటూరు హౌసింగ్ బోర్డు కాలనీలో జరిగిన చోరీ కేసులో టూటౌన్ పోలీసులు పురోగతి సాధించారు. ఈ కేసులో నిందితులను అరెస్ట్ చేశారు.

-8లో



కొండను తవ్వేస్తూ.. మట్టిని తరలిస్తూ..

రోడ్డు నిర్మాణానికి కాంట్రాక్టరు అక్రమంగా మట్టి తరలిస్తున్నారు. జమ్మలమడుగు నుంచి ముద్దనూరుకు వెళ్లే రహదారిలో కొండను పొక్లెయిన్ పెట్టి తవ్వేస్తున్నారు.

-8లో

గరిష్టం/కనిష్టం
32.1/25.0

వాతావరణం

జిల్లాలో బుధవారం 25.0 – 32.1 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 6.89 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

నేడు, రేపు స్టూడెంట్ పాసుల జారీ ఉండదు

కడప కోటిరెడ్డిసర్కిల్ : జిల్లా వ్యాప్తంగా అన్ని బస్టాండు కౌంటర్లలో విద్యార్థులకు బస్సు పాసులను గురు, శుక్రవారాల్లో జారీ చేయబోరని జిల్లా ప్రజా రవాణాధికారి పొలిమేర గోపాల్‌రెడ్డి తెలిపారు. సెలవుల అనంతరం స్కూళ్లు, కళాశాలలు పునః ప్రారంభించే సమయంలో విద్యార్థులకు కొత్త బస్సు పాసులను ఈనెల 14 నుంచి జారీ చేస్తామన్నారు. బస్సు పాసులను పొందే విద్యార్థులు తమ వివరాలను ఏపీఎస్ ఆర్టీసీ ఆన్‌లైన్ బస్సుపాస్ డాట్ ఇన్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకున్న తర్వాత జనరేట్ అయిన పిన్ నెంబరు కౌంటర్‌లో తెలియజేస్తూ బస్సు పాసుకోసం క్యూలైన్‌లో వేచి ఉండే సమయం తగ్గుతుందన్నారు. నమోదు ప్రక్రియ మొబైల్ ఫోన్ ద్వారా సులభంగా చేసుకోవచ్చని సూచించారు.

కమనీయం..కల్యాణం



మంగళసూత్రాన్ని చూపిస్తున్న అర్చకుడు

ఒంటిమిట్ట: ఒంటిమిట్టలోని కోదండరామస్వామి ఆలయంలో జేష్టమాసం పౌర్ణమిని పురస్కరించుకొని సీతారాముల కల్యాణోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక వైదికపై సీతారాముల ఉత్సవ మూర్తులను కొలువుదీర్చారు. బంగారు ఆభరణాలు, పుష్పాలతో అలంకరించారు. ముందుగా అర్చకులు విశ్వసేవపూజ, కంకణ పూజ, యజ్ఞోపవీత ధారణ తదితర కార్యక్రమాలు నిర్వహించారు.అనంతరం కల్యాణోత్సవం నిర్వహించారు. భక్తులు కల్యాణోత్సవాన్ని తిలకించి తరించారు.

రిమ్స్ సూపరింటెండెంట్‌గా కె.ఎస్.ఎస్. వెంకటేశ్వరరావు



కడప అర్బన్: కడప ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్) సూపరింటెండెంట్‌గా డాక్టర్ కె.ఎస్.ఎస్. వెంకటేశ్వరరావును నియమిస్తూ ఇటీవల డీఎంఈ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన ప్రస్తుతం అనంతపురం జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్నారు. గతంలో కడప రిమ్స్ ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తూ అనంతపురం జీజీహెచ్‌కు వెళ్లారు. ప్రస్తుతం తిరిగి కడప రిమ్స్ సూపరింటెండెంట్‌గా బదిలీ అయ్యారు. నేడో,రేపో ఆయన బాధ్యతలు స్వీకరించనున్నారు.

మాజీ సైనిక సంఘం అధ్యక్షుడిగా దాసరి రమణయ్య



కడప అర్బన్: ఉమ్మడి వైఎస్ఆర్ జిల్లా మాజీ సైనిక సంఘం నూతన అధ్యక్షుడిగా సుబేదార్ దాసరి రమణయ్యను ఎన్నుకున్నారు. జిల్లా సైనిక సంక్షేమ కార్యాలయం వద్ద బుధవారం వైఎస్సార్ కడప జిల్లా మాజీ సైనికుల సంఘం (డీఈఎస్ఎంఏ) సమావేశం నిర్వహించారు. గతంలో మాజీ సైనిక సంఘం అధ్యక్షుడిగా ఉన్న పువ్వాడ లక్ష్మీనారాయణ ఈ ఏడాది మార్చి 19న మరణించారు. ఆయన స్థానంలో నూతన అధ్యక్షుడిని ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో మాజీ కెప్టెన్ ఎస్.ఎస్. రాముడు, మాజీ వారెంట్ ఆఫీసర్ బి.వి.రంగయ్య, ప్రధాన కార్యదర్శి బి.వి. గోపాల్‌రెడ్డి, ఇతర మాజీ సైనికులు పాల్గొన్నారు.

మామిడికి గిట్టుబాటు ధర కల్పించాలని ధర్నా



రాజంపేట మార్కెట్‌యార్డులో నిరసన వ్యక్తం చేస్తున్న మామిడిరైతులు

రాజంపేట: మామిడిరైతులకు గిట్టుబాటుధర కల్పించాలని బుధవారం రాజంపేట వ్యవసాయ మార్కెట్‌యార్డులో ఏఐకేఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. రైతు సంఘంనేతలు పందికాళ్ల మణి, చిట్వేలి రవి మాట్లాడుతూ మామిడిరైతులను ఆదుకోవాలని, ఈ విషయంలో కలెక్టర్ జోక్యం చేసుకోవాలన్నారు. చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో ప్రైవేటు మ్యాంగో జ్యూస్ ఫ్యాక్టరీలు దాదాపు 200 ఉన్నాయన్నారు. వారు సిండికేట్‌గా ఏర్పడి గతంలో ఉన్న ధరల కన్నా సగానికి తగ్గించి వేశారన్నారు. చిత్తూరు కలెక్టర్ తోతాపూరి కేజీ రూ. 12గా ధర నిర్ణయించారన్నారు. ఆ ధర అమలు కావడంలేదన్నారు. రూ.6తో కొనుగోలు చేస్తున్నారన్నారు. గతంలో రూ.15వేల ఉన్న తోతాపురి కాయలు టన్ను రూ.6వేలకు కొనుగోలుచేశారన్నారు. ఈ ఏడాది మామిడికాపు తక్కువగా ఉందని, ధర పెరగాల్సి ఉందన్నారు.

చదువులు సాగేదెలా..!

నిన్నటి దాకా ఆట పాటల్లో మునిగి తేలిన విద్యార్థులు నేటి నుంచి పుస్తకాలతో కుస్తీ పట్టనున్నారు. నేడు బడి గంటలు మోగనున్నాయి. అందరూ బడి బాట పట్టనున్నారు.
అయితే అనేక పాఠశాలల్లో చాలీచాలని తరగతి గదులు, ఉపాధ్యాయుల కొరత, కనీస వసతులు లేకపోవడం, స్టూడెంట్స్ కిట్లు అందకపోవడం ఇలాంటి అనేక సమస్యలు వెంటాడుతున్నాయి. ఈ పరిస్థితుల్లో చదువులు సజావుగా సాగేనా అనే అనుమానం అందరిలో వ్యక్తమవుతోంది.



- నేటి నుంచి పాఠశాలలు పునః ప్రారంభం
- జిల్లాలో తలుపులు తెరుచుకోనున్న 2,816 స్కూళ్లు
- బడిబాట పట్టనున్న 3,05,330 మంది విద్యార్థులు
- పూర్తి స్థాయిలో చేరని స్టూడెంట్స్ కిట్లు
- చాలా పాఠశాలల్లో పనిచేయని ఆర్వో ప్లాంట్లు
- పూర్తికాని ఉపాధ్యాయుల బదిలీలు

సాక్షి ప్రతినిధి, కడప: వేసవి సెలవులంతా ఆటపాటలతో మునిగి తేలిన చిన్నారులు ఇక ఆటపాటలకు టాటా చెబుతూ చదువుల బాటకు వెల్‌కం చెబుతున్నారు. గురువారం నుంచి పిల్లలంతా బుద్ధిగా పుస్తకాల బ్యాగ్‌ను భుజాన వేసుకుని బడిబాట పట్టనున్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్య పాఠశాలలు పునః ప్రారంభం కానున్నాయి. పాఠశాలల ప్రారంభం నాటికి ఉపాధ్యాయ బదిలీల ప్రక్రియ పూర్తి కావాల్సి ఉండగా ఇంకా పెండింగ్‌లో ఉంది. మరో రెండు రోజులు కౌన్సెలింగ్ కొనసాగించాల్సి ఉంది. మరోవైపు విద్యార్థులకు అవసరమైన స్టూడెంట్స్ కిట్స్ చేరలేదు. అలాగే కొన్ని పాఠశాలల్లో తరగతి గదులు, టాయిలెట్స్ పనులు పెండింగ్‌లో ఉన్నాయి. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా అసౌకర్యాల మధ్య ఆయా ప్రధానోపాధ్యాయులు పాఠశాలలు పునః ప్రారంభించేందుకు సంసిద్ధులయ్యారు.

జిల్లాలో 2,816 విద్యాసంస్థలు..

వైఎస్సార్ జిల్లా విద్యాశాఖ గణాంకాల ప్రకారం ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల పరిధిలో 2816 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 3,05,330 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ప్రభుత్వ పరిధిలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలతోపాటు కేజీబీవీ, ఏపీ మోడల్ స్కూల్స్, ఏపీ రెసిడెన్షియల్, ఏపీ ట్రైబల్ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్ పేరుతో ఉన్న ప్రభుత్వ విద్యా సంస్థలు 2,042 ఉన్నాయి. వీటిల్లో 1,37,352 మంది విద్యార్థులున్నారు. అలాగే ప్రైవేటు యాజమాన్యాల పరిధిలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు 774 ఉన్నాయి. వీటి పరిధిలో 1,67,978 మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. ఈ విద్యాసంస్థలన్నీ గురువారం నుంచి ప్రారంభించి నూతన్య విద్యా సంవత్సరం కొనసాగించనున్నారు.

జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల వివరాలు....

పాఠశాల స్థాయి	పాఠశాలలు	విద్యార్థులు
ప్రాథమిక పాఠశాలలు	1,872	95,874
ప్రాథమికోన్నత పాఠశాలలు	310	34,459
ఉన్నత పాఠశాలలు	568	1,52,611
హైస్కూల్ ప్లస్	66	22,386
మొత్తం	2,816	3,05,330



సంసిద్ధంగా లేని స్టూడెంట్స్ కిట్స్



గతంలో పాఠశాలలు పునః ప్రారంభం అంటేనే పుస్తకాలు, కిట్స్ రెడీగా ఉండేవి. ఈమారు కూటమి సర్కార్‌కు ముందు చూపు లేకపోవడంతో విద్యార్థులకు పంపిణీ చేసేందుకు స్టూడెంట్స్ కిట్స్ అందుబాటులో లేవని పలువురు వాపోతున్నారు. మరోవైపు అయ్యవార్ల బదిలీలు పెండింగ్‌లో ఉన్నాయి. ఇంకో వైపు నాడు–నేడు పనులు నిలిచిపోయి తరగతి గదులు, టాయిలెట్స్ అసంపూర్తిగా ఉన్నాయి. విద్యార్థులు సురక్షిత మంచినీరు తాగేందుకు ఆర్వో ప్లాంట్స్ అస్తవ్యస్తంగా ఉన్నాయి. చాలా పాఠశాలల్లో నిర్వహణ లేకపోవడంతో మరుగున పడ్డాయి. గ్రామీణ విద్య పట్ల, మరీ ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలల పట్ల సర్కారుకు చిత్తశుద్ధి లేకపోవడంతోనే ఇలాంటి ముందుచూపు కొరవడిందని విద్యావేత్తలు వివరిస్తున్నారు.

ప్రభుత్వ పాఠశాలలను ప్రోత్సహించండి: డీఈఓ షంషుద్దీన్

జూన్ 12 నుంచి యధావిధిగా అన్ని పాఠశాలలు పునః ప్రారంభం కానున్నాయి. నిష్ణాతులైన ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలల్లో విధులు నిర్వర్తిస్తున్నారు. మెరుగైన విద్యా బోధన, వసతులు ప్రభుత్వ పాఠశాలల్లో పుష్కలంగా ఉన్నాయి. తల్లిదండ్రులు కార్పొరేట్ మోజు వీడి ప్రభుత్వ పాఠశాలల్లో వారి పిల్లల్ని చేర్పించాలి. కార్పొరేట్ పాఠశాలల్లో మూస పద్ధతిలో బట్టీ చదువులకు ప్రాధాన్యత ఉంటుంది. ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలల గురించి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.

వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా

ఏపీఎస్‌పీడీసీఎల్ టెక్నికల్ డైరెక్టర్ కె. గురవయ్య



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఎస్‌పీడీసీఎల్ టెక్నికల్ డైరెక్టర్ గురవయ్య

కడప కార్పొరేషన్: వినియోగదారులకు 24 గంటలు నాణ్యమైన అంతరాయం లేని విద్యుత్ సరఫరా ఇవ్వాలని ఏపీఎస్‌పీడీసీఎల్ టెక్నికల్ డైరెక్టర్ కె. గురవయ్య ఆదేశించారు. బుధవారం స్థానిక విద్యుత్ భవన్‌లోని సమావేశ భవనంలో డీఈలు, ఏఈలు, జేఏఓలతో సమావేశం నిర్వహించారు. అంతకుముందు పాతరిమ్స్‌లోని 33/11 కేవీ సబ్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయానికి పగటిపూట 9 గంటలు నిరంతర విద్యుత్ సరఫరా చేయాలన్నారు. విద్యుత్ సరఫరాలో హెచ్చు తగ్గులు లేకుండా నాణ్యమైన సరఫరా చేయాలని, సంస్థ ఉద్యోగులు, సిబ్బంది హెడ్ క్వార్టర్స్‌లో ఉంటూ నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలన్నారు. ప్రధాన మంత్రి సౌర విద్యుత్ పథకం ద్వారా ప్రతి ఒక్కరూ ఇంటి పైకప్పుపై సోలార్ ఫలకలు పెట్టుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ఈ పథకంలో బీసీలకు అదనంగా రూ.28వేలు సబ్సిడీ ఇవ్వనున్నట్లు చెప్పారు. ట్రాన్స్‌ఫార్మర్ల వైఫల్యాలను అరికట్టాలన్నారు. ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయిన వెంటనే సంస్థ ఖర్చులతో మరమ్మతులు చేయించాలన్నారు. ఇళ్లకు, వాణిజ్య సముదాయలకు, పరిశ్రమలకు దరఖాస్తు చేసిన వెంటనే విద్యుత్ సరఫరా ఇవ్వాలన్నారు. 50 శాతం డెవలప్‌మెంట్ చార్జెస్ మాత్రమే చెల్లించి తమ అదనపు లోడ్ క్రమబద్ధీకరణ చేసుకునే పథకం ఈ నెల 30 తో ముగియనుందని దానిని ఉపయోగించుకొనేలా ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఎస్‌ఈ రమణ, ఈఈ హరిసేవ్యా నాయక్, టెక్నికల్ ఈఈ మధుసూదన్, డీఈఈలు, ఏఏఓలు, ఏఈలు, జేఏఓలు పాల్గొన్నారు.

పట్టాలు తప్పిన ప్రొటోకాల్!

- రైల్వేఅధికారులను దారితప్పించిన పచ్చపెత్తనం
- ఢిల్లీ రైలుహాల్టింగ్ సభావేదికపై కూటమినేతలు



రాజంపేట రైల్వేస్టేషన్‌లో సభావేదికపై కూటమి నేతలను ఆసీనులు చేసిన రైల్వే అధికారులు

రాజంపేట: పార్లమెంటరీ నియోజకవర్గ కేంద్రమైన రాజంపేట రైల్వేస్టేషన్‌లో బుధవారం ఏపీ సంపర్క్ క్రాంతి ఎక్స్‌ప్రెస్ హాల్టింగ్(అదనపుస్టాపేజ్) సభ నిర్వహణ విషయంలో పాటించాల్సిన ప్రొటోకాల్‌ను రైల్వేశాఖ పట్టాలు తప్పించిందనే ఆరోపణలు రైల్వే వర్గాల నుంచి వినిపించాయి. ప్లాట్‌ఫాంలో కడప వైపు ఏర్పాటు చేసిన వేదికపై మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్సీ జకియాఖాన్‌ను పిలిచారు. తర్వాత ఆహ్వాన పత్రికలో పేర్కొన్న ప్రజాప్రతినిధులు పేర్లు కూడా కనీసం ఉచ్చరించకపోవడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. ఆహ్వానించిన వారు కొన్ని అనివార్యకారణాల వల్ల రాలేకపోయినప్పటికీ, ప్రొటోకాల్ రీతిలో అధికారులు ప్రస్ఫుటించలేకపోవడం విమర్శలకు దారితీసింది. విధిలేని పరిస్థితిలో రైల్వే అధికారులు ప్రొటోకాల్‌ను పక్కనపెట్టేసి, బీజేపీ నేతలు సాయిలోకేశ్, రమేష్‌నాయుడు, టీడీపీ నేత చమర్తి జగన్‌మోహన్‌రాజును వేదికను ఎక్కించేశారు. అక్కడి నుంచి వేదిక పూర్తిగా కూటమిపార్టీ సభగా మారిపోయిందని ఎద్దేవా చేశారు. అందరి చేతికి పచ్చజెండాలు ఇచ్చేశారు. రైలును కదిలించారు. వేదిక సాక్షిగా సన్మానాలు, సత్కారాలు చేసేసుకున్నారనే విమర్శలు వచ్చాయి. రైల్వేఅధికారులు అందరికి మాట్లాడే అవకాశం ఇస్తే ప్రొటోకాల్ రగడ రాజుకుంటుందని, ఒక్క మంత్రికే మాట్లాడే అవకాశం కల్పించడం గమనార్హం.

ఢిల్లీ రైలు హాల్టింగ్‌కు పచ్చజెండా

ఢిల్లీకి వెళ్లే ఏపీ సంపర్క్ క్రాంతి ఎక్స్‌ప్రెస్(12707/12708) రైలుకు రాష్ట్ర రవాణాశాఖమంత్రి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి పచ్చజెండా ఊపి ప్రారంభించారు. ఈయనతోపాటు ఎమ్మెల్సీ జకియాఖాన్, గుంటూరు డీఆర్ఎం సుధేష్టసేన్, డివిజన్ సీనియర్ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాజంపేట నుంచి దేశ రాజధానికి ప్రత్యక్ష అనుసంధాన్ని అందించే మొదటిరైలు ఇదే అని అన్నారు. రాజంపేట స్టేషన్ నుంచి తిరుపతి, కాచిగూడ, నాగ్‌పూర్, భోపాల్, ఢిల్లీ వంటి నగరాలకు ప్రయాణం సులభతరం చేస్తుందన్నారు.

ఎర్ర దొంగలకు మదనపల్లె రాచబాట?

- ఈ ప్రాంతం సేఫ్ జోన్‌గా స్మగర్ల కార్యకలాపాలు
- ఆగిపోయిన అటవీశాఖ నిఘా, దాడులు

మదనపల్లె: ఎర్రచందనం అక్రమ తరలింపునకు మదనపల్లె అటవీ రేంజి సురక్షిత ప్రాంతంగా స్మగ్లర్లు ఎంచుకున్నట్టు తెలుస్తోంది. కర్ణాటకలోని బెంగళూరు సమీపంలో ఉండటం, ఇక్కడ అటవీశాఖ తనిఖీలు, దాడులు పూర్తిగా లేకపోవడంతో ఇక్కడినుంచి తరలింపునకు అటంకం లేదని నిర్ధారించాక.. ఈ ప్రాంతం మీదుగా స్మగ్లింగ్ సాగుతున్న విషయం తిరుపతి టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడులు చేశాక కాని వెలుగులోకి రాలేదు. ఈనెల 9న తంబళ్లపల్లె మండలం అన్నగారిపల్లె వద్ద 48 ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకుని ములకలచెరువు, పెద్దమండ్యం, గుర్రంకొండ మండలాలకు చెందిన నలుగురు నిందితులను అరెస్ట్ చేయడంతో ఎర్ర చందనం స్మగ్లింగ్ మదనపల్లె రేంజి పరిధిలో సాగుతోందన్న విషయం స్పష్టమైంది. గతంలో పట్టుబడిన ఎర్ర చందనం, నమోదైన కేసులను పరిశీలిస్తే ఈ విషయం మరింత స్పష్టం అవుతుంది. అయితే కొంతకాలంగా మదనపల్లె అటవీశాఖ నుంచి దాడులు, నిఘా లేకపోవడంతో ఈ వ్యవహారం ఇంత కాలం వెలుగులోకి రాలేదు. దీంతో ప్రస్తుతం ఇది చర్చనీయాంశమైంది.

స్మగర్లు ఎంచుకున్న మార్గాలు?

జిల్లాలోని రాజంపేట లేదా ఇతర ప్రాంతాల నుంచి ఎర్ర చందనం దుంగలను కర్ణాటకలోని ప్రాంతాలకు తరలించేందుకు స్మగ్లర్లు మార్గాలుగా ఎంచుకున్నట్టు తెలుస్తోంది. జిల్లాలోని గాలివీడు నుంచి పెద్దమండ్యం, సత్యసాయి జిల్లాలోని కదిరి మీదుగా.. మదనపల్లె రేంజిలోని ములకలచెరువు నుంచి బి.కొత్తకోట మీదుగా బెంగళూరు, చెన్నైలకు, పెద్దమండ్యం మండలంలోని పాపేపల్లె, దిగువపల్లె గ్రామాల మీదుగా, గాలివీడు మండలం గోరానిచెరువు నుంచి సరిహద్దు పాపేపల్లి పంచాయతీలోని గొర్లవానికుంట మీదుగా పెద్దమండ్యంలోకి, గుడిసివారిపల్లె మీదుగా పెద్దమండ్యం-తంబళ్లపల్లె మార్గం, గాలివీడు బస్టాండు నుండి దిగువపల్లె మీదుగా బండ్రేవు వద్ద పెద్దమండ్యం-తంబళ్లపల్లె మార్గం మీదుగా ములకలచెరువు, మదనపల్లె వైపు వెళ్తున్న మార్గం, వైఎస్సార్ జిల్లాలోని పులివెందుల మీదుగా.. సత్యసాయి జిల్లా కదిరి నుంచి ములకలచెరువు మీదుగా బి.కొత్తకోట, శంకరాపురం నుంచి కర్ణాటకకు, అలాగే ములకలచెరువు నుంచి మద్దయ్యగారిపల్లె మీదుగా కందుకూరు, కర్ణాటకలోని చేలూరు నుంచి బెంగళూరుకు, కదిరి నుంచి ములకలచెరువు మీదుగా మదనపల్లె, అక్కడినుంచి చీకలబైలు నుంచి కర్ణాటకలోకి స్మగ్లింగ్ సాగించేందుకు ఎలాంటి ఆటకం లేకపోవడం, రద్దీ ఉండని కారణంగా ఈ మార్గాలు ఎంచుకున్నట్టు భావిస్తున్నారు. తొమ్మిదో తేదిన తంబళ్లపల్లె నుంచి ములకలచెరువు మార్గంలోని అన్నగారిపల్లె వద్ద దుంగలు పట్టుబడ్డాయి. అంటే ఈ మార్గంలో ములకలచెరువు చేరుకుని అక్కడి నుంచి వారి గమ్యస్థానానికి చేర్చే ప్రయత్నంగా తెలుస్తోంది. గుర్రంకొండ, పెద్దమండ్యం, మదనపల్లె మీదుగా చీకలబైలు మార్గం కూడా స్మగ్లింగ్‌కు సురక్షితంగా భావిస్తున్నట్టు తెలుస్తోంది. ఈ రేంజిలో అధికంగా తంబళ్లపల్లె నియోజకవర్గంలోనే ఎర్ర చందనం కేసులు అధికంగా నమోదు కావడం విశేషం.



మూతపడిన శంకరాపురం అటవీ చెక్‌పోస్టు

చెక్‌పోస్టుల మూత

మదనపల్లె నియోజకవర్గం చీకలబైలు, తంబళ్లపల్లె నియోజకవర్గం బి.కొత్తకోట మండలంలోని శంకరాపురం వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులను మూసివేశారు. ఇవి ఉన్నప్పుడు విధుల్లోని అటవీ సిబ్బంది తనిఖీలైనా చేసేవారు. ఇప్పుడు ఆ అవకాశం కూడా లేదు. దీంతో ఈ మార్గాల్లో స్మగ్లింగ్ చేసుకునేందుకు అటంకం లేకుండాపోయింది.

చెరువును చెరబట్టారు!



పాత కడప చెరువులో ఇలా మట్టి అక్రమ రవాణా..

- పాత కడప చెరువులో మట్టిని అక్రమంగా తవ్వేస్తున్న వైనం
- రెండు జేసీబీలు, పది టిప్పర్లు, ట్రాక్టర్లతో యథేచ్ఛగా అక్రమ రవాణా

కడప కార్పొరేషన్: కడప నగరానికి అతి సమీపంలో ఉన్న పాతకడప చెరువును టీడీపీ నేతలు చెరబట్టారు. చెరువులోని మట్టిని జేసీబీలు, హిటాచీలతో తవ్వి 15 టిప్పర్లు, ట్రాక్టర్లతో యథేచ్ఛగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. చెరువు మట్టి సారవంతంగా ఉంటుంది కనుక చౌడు భూముల్లో సారవంతమైన ఈ మట్టిని వేస్తే పంటలు బాగా పండేందుకు ఆస్కారముంటుంది. అలాగే లో లెవెల్ ఏరియాలలో ఎత్తు పెంచడానికి ఈ మట్టిని ఉపయోగిస్తున్నారు. ఒక్కో టిప్పర్ రూ.5వేలు, ఒక్కో ట్రాక్టర్ రూ.600 చొప్పున విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఒక రోజుకు టిప్పర్లతో 100 ట్రిప్పులు, ట్రాక్టర్లతో 100 ట్రిప్పులు తోలినా రూ.5.50లక్షలు వచ్చే అవకాశం ఉంది. ఎన్ని రోజులు తోలుకుంటే అన్ని లక్షల ఆదాయం అన్నమాట. పాత కడప రైతులమంటూ కొంతమంది విచ్చలవిడిగా దందా మట్టి రవాణా చేస్తూ చెరువును తవ్వేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇంత దర్జాగా మట్టి అక్రమ రవాణా చేస్తుంటే ఇరిగేషన్, మైన్స్ అండ్ జియాలజీ, పోలీసు అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడటం లేదన్న విమర్శలు ఉన్నాయి. మట్టి మాఫియాపై కొందరు అధికార పార్టీ నేతలే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. జిల్లా కలెక్టర్ అయినా స్పందించి చర్యలు తీసుకుంటారని వారు ఆశిస్తున్నారు. నివాస గృహాలకు దగ్గరగా బఫర్ జోన్‌లో మట్టి తవ్వడం వల్ల చెరువుకు నీరు ఎక్కువగా వచ్చినప్పుడు ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉంటుంది. పిల్లలు ఎవరైనా ఈతకు వెళ్తే లోతు తెలియక ఇరుక్కుపోయి చనిపోయే అవకాశం లేకపోలేదు. ఇలాంటి ప్రమాదాలు ఇదివరకు చాలానే జరిగాయి కూడా. అయినా ఇరిగేషన్ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నిత్యం ట్రాక్టర్లు, టిప్పర్లతో మట్టి తోలడం వల్ల దేవుని కడప, పాత కడప ప్రాంతాలు దుమ్ము, ధూళితో నిండిపోతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బుగ్గవంకనూ వదల్లేదు..



పాలెంపల్లె వద్ద బుగ్గవంకలో మట్టి అక్రమ రవాణా దృశ్యం

కడప నగరం మధ్యలో ప్రవహిస్తున్న బుగ్గవంకను కూడా టీడీపీ నాయకులు తమ అక్రమ రవాణాకు అడ్డాగా మార్చుకున్నారు. బుగ్గవంక బ్యూటిఫికేషన్ పేరు చెప్పి రూ.3.50 కోట్ల అత్యధిక మొత్తానికి టెండర్లు పిలిచి బుగ్గవంకలోని కంపచెట్లను తొలగించిన ఆ పార్టీ నేతలు.. ఇప్పుడు వంకలోని మట్టిని కూడా అమ్ము కొని సొమ్ము చేసుకుంటున్నారు. పాలెంపల్లె వద్ద బుగ్గవంకలోని మట్టిని జేసీబీ, హిటాచీలతో తవ్వి ట్రాక్టర్లలో తరలిస్తున్నారు. నెలరోజులుగా ఇలాగే తరలిస్తున్నా పట్టించుకున్న నాథుడే కరువయ్యాడు. ఒక్కో ట్రాక్టర్ మట్టిని రూ.500 చొప్పున విక్రయిస్తూ రోజుకు 600 ట్రిప్పుల మట్టిని తరలిస్తున్నట్లు తెలుస్తోంది. ఇలా నెల రోజుల్లో రూ.90లక్షల వరకూ ఆర్జించినట్లు తెలుస్తోంది. నిత్యం ట్రాక్టర్లు మట్టితో తిరగడం వల్ల పాలెంపల్లె, బుడ్డాయపల్లె గ్రామాల్లోని రోడ్లు మట్టితో నిండిపోయాయి. వాహనాలు వెళ్లినప్పుడల్లా దుమ్ము, ధూళి పైకి లేచి ఇళ్ల నిండా దుమ్ము పేరుకుపోతోందని, ట్రాక్టర్ల శబ్దాలతో శబ్ద కాలుష్యం, వాయు కాలుష్యం ఏర్పడుతోందని స్థానిక ప్రజలు వాపోతున్నారు.

ఏసీపీ మునిరత్నంకు ఫీల్డు బాధ్యతల తొలగింపు

కడప కార్పొరేషన్: కడప నగరపాలక సంస్థ అసిస్టెంట్ సిటీ ప్లానర్ మునిరత్నంకు ఫీల్డు బాధ్యతలు తొలగిస్తూ కమిషనర్ మనోజ్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఏసీపీ కడపలో బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి ఆయన వ్యవహార శైలిపై వివాదాలు, ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. బిల్టప్ వద్ద అధికార పార్టీ నేతకు చెందిన భవనానికి అనుమతులు లేవని బెదిరించడంతో వారు టౌన్‌ప్లానింగ్ అధికారులందరినీ నిర్బంధించిన వ్యవహారం అప్పట్లో హాట్ టాపిక్ అయ్యింది. ఆ తర్వాత కూడా ఆయన భవన నిర్మాణ యజమానులు, లే ఔట్ల యజమానులను బెదిరించి డబ్బులు గుంజుతున్నారన్న ఆరోపణలు ఎక్కువగా ఉన్నాయి. అధికార, ప్రతిపక్ష పార్టీలనే తేడా లేకుండా తనకు ఎక్కడ లాభం వస్తే అలాంటి పనులే చేస్తారన్న విమర్శలు ఉన్నాయి.

- ఇదివరకు పనిచేసిన ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో కూడా ఈయనపై వివాదాలు, ఆరోపణలు ఎక్కువగానే వచ్చాయి. ఇటీవల నిర్వహించిన స్టాండింగ్ కమిటీ సమావేశంలో మేయర్ సురేష్ బాబు మునిరత్నంను ప్రభుత్వానికి సరెండర్ చేయాలని కమిషనర్‌కు సూచించారు. ఇటీవల కడపలో నిర్వహించిన మహానాడు సందర్భంగా నగరంలో విచ్చలవిడిగా ఫ్లెక్సీలు, బ్యానర్లు , హోర్డింగులు ఏర్పాటు చేసినా కార్పొరేషన్‌కు ఒక్క రూపాయి కూడా ఆదాయాన్ని తేవడంలో విఫలమైనట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఆయనను ఫీల్డు బాధ్యతల నుంచి తొలగించడం టౌన్‌ప్లానింగ్‌లో నెలకొన్న అవినీతికి నిదర్శనంగా చెప్పవచ్చు.

క్లుప్తంగా

బీటెక్ విద్యార్థి ఆత్మహత్య


మృతుడు పవన్‌కుమార్

జమ్మలమడుగు : ఎర్రగుంట్ల మండలం ప్రకాష్ నగర్ కాలనీకి చెందిన దాసరి పవన్ కుమార్(20) బుధవారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ప్రకాష్ నగర్‌కు చెందిన పవన్‌కుమార్ ప్రొద్దుటూరు సీబీఐటీ కాలేజ్‌లో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. కొంత కాలంగా కడుపునొప్పి వస్తుండటంతో ఆ బాధను భరించలేక బుధవారం తెల్లవారుజామున ఐదు గంటల ప్రాంతంలో ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని మరణించినట్లు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నట్లు వెల్లడించారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ తగిలి ఎద్దు మృతి


మృతి చెందిన ఎద్దు

కలసపాడు : మండలంలోని ఎగువరామాపురం గ్రామానికి చెందిన ఎనుముల అంకిరెడ్డికి చెందిన ఎద్దు ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి మృతిచెందింది. బుధవారం అంకిరెడ్డి ఎద్దులను పొలానికి తీసుకెళ్లి ఇంటికి వస్తున్నారు. గ్రామ సమీపంలో కాలువ దాటే క్రమంలో పరిగెత్తుకుంటూ వెళ్లిన ఎద్దు తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మీద పడింది. దీంతో విద్యుత్ ఘాతానికి గురైన అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ఎద్దు విలువ రూ.70వేలు అని రైతు అంకిరెడ్డి తెలిపారు.

యువకుడు అదృశ్యం


వెల్లపు వేణు(ఫైల్)

జమ్మలమడుగు రూరల్ (మైలవరం): మైలవరం మండలం వేపరాల గ్రామానికి చెందిన వెల్లపు వేణు(32) అదృశ్యమైనట్లు తండ్రి చౌడప్ప మైలవరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ శ్యాసుందర్‌రెడ్డి వివరాల మేరకు.. మైలవరం మండలం వేపరాల గ్రామానికి చెందిన వెల్లపు వేణు డిగ్రీ పూర్తిచేశాడు. ఇతను ప్రొద్దుటూరు వాస్తు కాంప్లెక్స్‌లోని నారాయణ స్వామికి చెందిన హార్డ్‌వేర్ అంగడిలో గుమాస్తాగా పనిచేస్తున్నాడు. ఈ నెల 6వతేదీన ఇంటి నుంచి వెళ్లిన అతడు తరువాత ఇంటికి తిరిగి రాలేదని ఎస్ఐ తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 9121100608 నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని ఆయన సూచించారు.

ఆటలకు బై.. పాఠాలకు సై

వేసవి సెలవులు ముగిశాయ్.. దాదాపు రెండు నెలలపాటు తోటి స్నేహితులతో ఆటలాడుతూ గడిపిన చిన్నారులు మళ్లీ టై కట్టి. బూట్లు వేసుకుని.. బడి బాట పట్టనున్నారు. విజ్ఞానం కోసం పలు శిక్షణ శిబిరాల్లో గడిపిన వారంతా ఇపుడు మళ్లీ పాఠాలు నేర్వడానికి సై అంటున్నారు. నేడు పాఠశాలలు తెరచుకోనున్నాయి. సెలవుల నేపథ్యంలో నగరం, పట్టణాల్లోని పాఠశాలల్లో చదివే చిన్నారులు ఇంటి బాట పట్టారు. తిరిగి ఇపుడు బడిబాట పట్టి.. గమ్య స్థానాలకు చేరుకుంటున్నారు. దీంతో బస్టాండులో బస్సులు కిటకిటలాడుతున్నాయి. ఈ నేపథ్యంలో నిన్నటి వరకూ చిన్నారులు గడిపిన క్షణాలు, బస్టాండులో పరిస్థితులపై దృశ్యాలివీ..

– సాక్షి ఫొటోగ్రాఫర్, కడప







ఎంపీ మిథున్‌రెడ్డి కృషితోనే సంపర్క్ క్రాంతి రైలుకు హాల్టింగ్

రాజంపేట : రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి, రాజ్యసభసభ్యుడు మేడా రఘునాథరెడ్డిల కృషి తోనే రాజంపేట రైల్వేస్టేషన్‌లో ఏపీ సంపర్క్ క్రాంతి ఎక్స్‌ప్రెస్ రైలుకు హాల్టింగ్ కల్పించారని గుంతకల్ డీఆర్‌యూసీసీ సభ్యుడు తల్లెం భరత్‌కుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు జెనుగు కృష్ణారావు యాదవ్, దండుగోపి తదితరులు పేర్కొన్నారు. స్థానిక విలేకరులతో వారు మాట్లాడుతూ రాజంపేట రైల్వే స్టేషన్‌లో ఏపీ సంపర్క్ క్రాంతి రైలు అదనపు స్టాపేజీకి ఒకటిన్నర దశాబ్దం పట్టిందన్నారు. ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి రాజంపేట రైల్వే స్టేషన్‌లో అన్ని రైళ్లకు హాల్టింగ్ కల్పించాలని ఎంపీలను కోరుతూ వచ్చారన్నారు. రాజంపేట ఆర్వోబీకి ప్రత్యామ్నాయంగా సబ్‌వేకు రైల్వే బడ్జెట్‌లో రూ.2 కోట్లు కేటాయించేలా ఎంపీ మిథున్‌రెడ్డి కృషి చేశారన్నారు. అమృత్‌భారత్ పథకం కిందకు తీసుకురావడంతో ఆ దిశగా రైల్వే శాఖ కోట్లా దిరూపాయిలు వెచ్చించిందన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు వడ్డె రమణ, రమేష్ నాయుడు, సనిశెట్టి నవీన్, జావిద్‌అలీ, మసూద్ అలీఖాన్, శ్రీనివాసులు, మారుతి పాల్గొన్నారు.

ఫీజుల నియంత్రణ చట్టం అమలుచేయాలి

- ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుడంరెడ్డిబాబు


విలేకరులతో మాట్లాడుతున్న దుడం రెడ్డిబాబు

కడప కోటిరెడ్డిసర్కిల్ : విద్యా సంస్థల్లో ఫీజుల నియంత్రణ చట్టం అమలుకాకపోవడంతో తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుడంరెడ్డి బాబు కోరారు. కడప ప్రకాశ్‌నగర్‌లో విలేకరులతో బుధవారం ఆయన మాట్లాడుతూ టెక్నోల పేరుతో కార్పొరేట్, ప్రైవేట్ స్కూళ్లలో విద్యా వ్యాపారం జరుగుతున్నా పట్టించుకునే నాధుడే లేడన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభం గాకముందే అడ్మిషన్లు చేయించుకుంటూ దోపిడీకి తెరతీస్తున్నారన్నారు. కనీస సదుపాయాలు లేకున్నాఇరుకుభవనాల్లో విద్యా సంస్థలను నడుపుతున్నారన్నారు. విద్యార్థులకు మరుగుదొడ్లు లేకపోవడంతో బాలికల బాధలు వర్ణనాతీతం అన్నారు. ఇప్పటికైనా సీఎం చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి నారాలోకేష్ చొరవ తీసుకుని విద్యా చట్టాన్ని అమలు చేసే విధంగా అడుగులు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీ బీసీ సంక్షేమ చేనేత సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఓర్సు వీరభాస్కర్. ఎస్ఎండీ.యూసుఫ్‌బాషా, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు ఎస్.మణికుమార్ పాల్గొన్నారు.

షర్మిల సమావేశాన్ని శాంతియుతంగా అడ్డుకుంటాం


మాట్లాడుతున్న సత్తార్, తదితరులు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : నగరంలోని ఐఎంఏ హాల్‌లో 12న జరగబోయే పీసీసీ అధ్యక్షురాలు షర్మిల సమావేశాన్ని శాంతియుతంగా గాంధేయమార్గంలో అడ్డుకుంటామని కాంగ్రెస్ పార్టీ మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ఎ.సత్తార్, మాజీ డీసీసీ ఉపాధ్యక్షుడు నాసిర్ హుస్సేన్, డీసీసీ మహిళా అధ్యక్షురాలు శ్యామలమ్మ, పేర్కొన్నారు. నగరంలోని వైఎస్ఆర్ మెమోరియల్ ప్రెస్ క్లబ్‌లో విలేకరులతో వారు మాట్లాడుతూ దివంగత నేత వైఎస్.రాజశేఖరరెడ్డి కుమార్తె షర్మిల కాంగ్రెస్ పార్టీలోకి రావడంతో ఆ పార్టీకి పూర్వ వైభవం వస్తుందనుకున్నామన్నారు. కానీ టీడీపీకి ఆమె కోవర్టుగా పనిచేస్తూ.. కాంగ్రెస్ పార్టీ నాయకులకు దూరంగా ఉంటున్నారన్నారు. సీనియర్ నాయకులను దూరం చేస్తూ తనకు కావాల్సిన వారిని పదవుల్లో నియమిస్తున్నారని ఆరోపించారు. రాజంపేట ఎంపీ అభ్యర్థిగా నజీర్‌అహ్మద్‌ను ఏఐసీసీ ఎన్నిక చేస్తే చివరి నిమిషంలో తెలంగాణకు చెందిన ఆర్థిక నేరగాడికి టికెట్ ఇచ్చారన్నారు. హిందూపురం ఎంపీ అభ్యర్థిగా ఎస్ఎ.సత్తార్, ఖాశింఖాన్‌లకు ఇవ్వాలని బలపరిచినా కర్ణాటకకు చెందిన వ్యక్తికి కేటాయించి పార్టీకి నష్టం కలిగేలా చేశారన్నారు. షర్మిల నాయకత్వాన్ని తాము పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అక్రమ్, నాసిర్‌ఖాన్, కర్నాటి చంద్రశేఖర్‌రెడ్డి, అన్వర్, జాన్‌బాషా, రత్నకుమారి పాల్గొన్నారు.

కొండను తవ్వేస్తూ.. మట్టిని తరలిస్తూ

అధికారం మాదే.. అడ్డెవరన్నట్లు ఓ కాంట్రాక్టర్ ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారు. రెవెన్యూ అధికారుల అనుమతులు తీసుకోకుండా కొండను తవ్వేసి మట్టిని జాతీయ రహదారి నిర్మాణానికి తరలించేస్తున్నారు. ఇదంతా చూస్తున్న అధికారులు ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

- పొక్లెయిన్‌తో తవ్వి టిప్పర్లతో మట్టి తరలింపు
- అధికార పార్టీ గుత్తేదారు నిర్వాకం


పొక్లెయిన్‌తో కొండను తవ్వి మట్టిని టిప్పర్‌కు నింపుతున్న కూలీలు

జమ్మలమడుగు : కల్వకుర్తి–నంద్యాల జాతీయ రహదారి నిర్మాణం వేగంగా జరుగుతోంది. కడప జిల్లా జమ్మలమడుగు పట్టణం మీదుగా ముద్దనూరు రహదారిలో కొత్త రోడ్డు వరకు ఈ దారి విస్తరణ పనులు చేపట్టారు. ప్రస్తుతం నంద్యాల–కోవెల కుంట్ల మీదుగా నొస్సం వరకు రోడ్డు పనులు జరుగుతున్నాయి. పెద్దముడియం మండలం గుల్లకుంట మీదుగా ఉప్పలపాడు, జమ్మలమడుగు, పెన్నానది మీద నుంచి పాలిటెక్నిక్ కళాశాల వెనుక వైపునా కొత్త రోడ్డు విస్తరణ పనులను ఎస్ఆర్‌సీప్రైవేట్ లిమిటెడ్ పేరుతో అధికార పార్టీ కాంట్రాక్టర్ పనులు దక్కించుకున్నారు. పెద్దముడియం మండలం నుంచి జమ్మలమడుగు కొత్త రోడ్డు వరకు 22 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణానికి రూ.170 కోట్లు కేటాయించారు. ప్రస్తుతం పనులు చేపట్టిన గుత్తేదారు ఇష్టారాజ్యంగా పనులు చేస్తున్నా..అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు.

యథేచ్ఛగా మట్టి తరలింపు

రోడ్డు నిర్మాణానికి గుత్తేదారు అక్రమంగా మట్టి తరలిస్తున్నారు. ముద్దనూరుకు వెళ్లే రహదారిలో కొండను పొక్లెయిన్ పెట్టి తవ్వేస్తున్నారు. టిప్పర్లు పెట్టి తరలిస్తున్నా.. ఆ వాహనాలన్నీ అధికారుల కళ్లెదుటే తిరిగినా ఏమాత్రం పట్టించుకోవడం లేదు. అనుమతులు లేకుండా పనులు చేస్తున్న గుత్తేదారును అడ్డుకునేందుకు అధికారులు జంకుతున్న పరిస్థితి. తమదే అధికారం.. మాకు అడ్డు ఎవరు అంటూ కొండను పిండి చేస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతోంది.

ఎలాంటి అనుమతులు లేవు

జాతీయ రహదారి కోసం కొండ తవ్వుతున్నారనే విషయం నా దృష్టికి వచ్చింది. ఎంత మట్టి తవ్వారో మొత్తం క్యూబిక్ మీటర్ల మేర కొలిచి చలానా కట్టిస్తాం. అనుమతులు తీసుకునే విధంగా చర్యలు తీసుకుంటాం.

– శ్రీనివాసరెడ్డి, తహసీల్దార్, జమ్మలమడుగు

రైతులను ఆదుకునేందుకు చర్యలు

మదనపల్లె రూరల్ : టమాటా రైతులను ఆదుకునేందుకు, నష్టాలు తగ్గించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై వ్యవసాయ, ఉద్యాన, పరిశ్రమల శాఖ అధికారులు, వ్యవసాయరంగ నిపుణులతో కమిటీ వేసి అధ్యయనం చేస్తున్నట్లు ఆంధ్ర ప్రదేశ్ 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్ అన్నారు. అన్నమయ్య జిల్లా మదనపల్లె పర్యటనలో భాగంగా బుధవారం స్థానిక వ్యవసాయ మార్కెట్‌కమిటీ కార్యాలయంలో టమాటా రైతుల సమస్యలపై అధికారులతో ఆయన సమీక్షించారు. టమాటా ఉత్పత్తి, విస్తీర్ణం, దిగుబడులు, మార్కెటింగ్, ఎగుమతులు, ధరల ఒడిదుడుకులు, నష్టనివారణ చర్యలు, ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడుతూ..టమాటా రైతులు నష్టపోతున్న తరుణంలో వారికి లాభాలు వచ్చేందుకు ఏం చేయాలనే విషయమై చర్చలు జరిపామన్నారు. నెలరోజుల్లోపు నివేదిక ఇవ్వాల్సిందిగా అధికారులను ఆదేశించామని, రాగానే సీఎం చంద్రబాబునాయుడు, వ్యవసాయశాఖమంత్రి అచ్చెన్నాయుడు, పరిశ్రమలశాఖ మంత్రి టీజీ.భరత్‌ను కలిసి ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రస్తుత మార్కెట్‌యార్డు విస్తీర్ణం రైతుల అవసరాలకు సరిపోకపోవడం, ట్రాఫిక్‌సమస్య తలెత్తడంతో మార్కెట్‌ను తరలించి, భవిష్యత్ అవసరాలకు సరిపోయేలా ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. కార్యక్రమంలో పరిశ్రమలశాఖ అధికారి సురేష్, ఉద్యానశాఖ అధికారిణి సుభాషిణి, లక్ష్మీ ప్రసన్న, ఏడీఏ శివశంకర్, ఏఓ నాగప్రసాద్, హెచ్ఓ ఈశ్వర్‌ప్రసాద్‌రెడ్డి, మార్కెట్‌కమిటీ సెక్రటరీ అభిలాష్ పాల్గొన్నారు.

ఆత్మనిర్భర వికసిత్ భారత్ వైపు పయనం

ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో, బీజేపీ 11 ఏళ్ల పాలనలో ఆత్మనిర్భర వికసిత్ భారత్–2047 వైపు దేశం పయనిస్తోందని ఏపీ 20 సూత్రాల కార్యక్రమాల అమలు చైర్మన్ లంకా దినకర్ అన్నారు. బీజేపీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ...2014లో ప్రధాని నరేంద్రమోదీ బాధ్యతలు స్వీకరించినప్పుడు 11వ స్థానంలో ఉన్నటువంటి దేశ ఆర్థిక వ్యవస్థ 2025 నాటికి జపాన్‌ను వెనుక్కు నెట్టి 4.20 ట్రిలియన్ డాలర్లతో ప్రపంచంలో 4వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించిందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు సాయిలోకేష్, ప్రధాన కార్యదర్శులు యల్లంపల్లె ప్రశాంత్, ఆకులకృష్ణమూర్తి, భగవాన్, బండిఆనంద్, ఓసూరికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

నన్నే కారు తీయమంటావా..


ధరణికుమార్‌ను పరామర్శిస్తున్న సిబ్బంది

పీలేరు రూరల్ : అడ్డంగా పెట్టిన కారు పక్కకు తీయాలని అడిగిన సెక్యూరిటీ గార్డుపై నన్నే కారు తీయమంటావా అంటూ ఓ టీడీపీ నాయకుడు విరుచుకుపడిన సంఘటన బుధవారం జరిగింది. బాధితుడి వివరాల మేరకు.. ఏరియా ఆస్పత్రిలో బుధవారం పట్టణానికి చెందిన తుమ్మల ధరణీకుమార్ సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వహిస్తున్నాడు. బుధవారం ఆయన విధులు నిర్వర్తించే సమయంలో టీడీపీ నాయకుడు మహేష్ వచ్చారు. ఆస్పత్రి ఆవరణలో రోడ్డుపై అడ్డంగా కారు పార్క్ చేశాడు. కారు పక్కకు తీయాలని అక్కడే ఉన్న ధరణీ కుమార్ కోరారు. దీంతో ఆవేశంగా నన్నే కారు తీయమంటావా.. అంటూ ధరణికుమార్‌పై మహేష్ దాడి చేశాడు. బాధితుడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోకపోవడతో దళిత సంఘాల నాయకులతో కలిసి స్టేషన్ ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు టిఎల్.వెంకటేష్, సుధాకర్ బాబు, సుభాష్, బోదేషా పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి గాయాలు

చింతకొమ్మదిన్నె : కడప నగరం సాక్షి సర్కిల్ నుంచి రాయచోటి సర్కిల్ వైపునకు వెళుతూ జయరాజ కల్యాణ మండపం సమీపంలో రింగు రోడ్డుపై రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో శ్రీకాంత్ (23)కు తీవ్ర గాయాలవగా, మరో నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు 108 అంబులెన్సు ద్వారా రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. గాయపడిన వారు ప్రకాశం జిల్లాకు చెందిన వారని సమాచారం.

కారు వ్యవహారంలో వ్యక్తి అరెస్టు

ప్రొద్దుటూరు క్రైం : కారు కొనుగోలు వ్యవహారంలో ఓ పాఠశాలలో పనిచేస్తున్న గణేష్‌ను రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల వివరాల మేరకు.. గణేష్ రూరల్ పరిధిలోని ట్రస్టు ఆధ్వర్యంలో నడిచే పాఠశాలలో పనిచేస్తున్నాడు. ఏడాది క్రితం గుంటూరు జిల్లాలోని వినుకొండలో ఉంటున్న కోటేశ్వరరావు స్కార్పియో వాహనాన్ని అద్దె ప్రాతిపదికన తెచ్చుకున్నాడు. అద్దె డబ్బులను కారు కంతులు చెల్లించేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. కొన్ని రోజులు గణేష్ అద్దె చెల్లించాడు. తర్వాత అద్దె చెల్లించకుండా కాలయాపన చేస్తూ వచ్చాడు. ఎన్ని సార్లు ఫోన్ చేసినా స్పందించలేదు. దీంతో కొన్ని రోజుల క్రితం కోటేశ్వరరావు ప్రొద్దుటూరుకు వచ్చి పాఠశాల ఆవరణలో స్కార్పియో కారును తీసుకెళ్లేందుకు ప్రయత్నించగా గణేష్ అడ్డుకొని బలవంతంగా అతన్ని బయటకి తోసేశాడు. దీంతో కోటేశ్వరరావు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో బుధవారం గణేష్‌ను అరెస్ట్ చేసి రిమాండుకు తరలించినట్లు ఎస్ఐ అరుణ్‌రెడ్డి తెలిపారు.

పట్టపగలే యువకుడి కిడ్నాప్

ఏడుగురిపై కేసు నమోదు


కిడ్నాప్‌కు గురైన తౌలిక్‌అల్లి (లాలు)

కలకడ : పట్టపగలే యువకుడిపై దాడి చేసి కిడ్నాప్ చేసిన సంఘటన మంగళవారం మధ్యాహ్నం కలకడ టౌన్‌లో జరిగింది. ఎస్ఐ రామాంజనేయులు కథనం మేరకు.. కలకడ టౌన్ గుర్రంకొండ రోడ్డు సందువీధికి చెందిన పర్వీన్‌ను ఐదేళ్ల కిందట రాయచోటికి చెందిన ఖాజాకు ఇచ్చి వివాహం జరిపించారు. ఈ క్రమంలో ఖాజా భార్య పర్వీన్ అన్నదమ్ములకు రూ.10 లక్షలు అప్పుగా ఇచ్చింది. ఇచ్చిన నగదు ఇవ్వాలని నాలుగు సంవత్సరాలుగా కోరుతున్నా తిరిగి చెల్లించడం లేదని ఖాజా మంగళవారం మధ్యాహ్నం మరో ఆరుగురు అనుచరులతో కలకడకు వచ్చి తౌలిక్ ఆలీని కిడ్నాప్ చేశారు. కట్టె కొట్టి చిత్రహింసలకు గురిచేశారు. బుధవారం కిడ్నాప్‌కు గురైన తౌలిక్ అల్లి (లాలు)తల్లి షేక్ కౌషిక్ ఫిర్యాదు మేరకు ఖాజా, మరో ఆరుగురిపై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు.

విద్యుత్ షాక్‌తో రైతు మృతి

- బోరు వద్ద మరమ్మతులు చేస్తుండగా ప్రమాదం
- నివాళులర్పించిన కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి


మృతి చెందిన రమేష్ రెడ్డి (ఫైల్‌ఫొటో)


రమేష్‌రెడ్డికి నివాళులర్పిస్తున్న ఎంపీ వైఎస్.అవినాష్‌రెడ్డి, తదితరులు

తొండూరు : గ్రామంలో అందరికీ సాయం చేస్తూ ఆదరణ పొందిన పల్లేటి రమేష్‌రెడ్డి(46) రైతు పల్లేటి రమేష్ రెడ్డి బుధవారం విద్యుత్తు షాక్‌తో మృతి చెందాడు. మృతుడి బంధువుల కథనం మేరకు.. మండలంలోని క్రిష్ణంగారిపల్లెకు చెందిన రమేష్‌రెడ్డి, సర్పంచ్ రమణారెడ్డి బుధవారం స్థానిక తాగునీటి బోరు పనిచేయకపోవడంతో అక్కడికి వెళ్లారు. విద్యుత్తు మోటారు స్టార్టర్ బాక్స్ వద్దకు వెళ్లి రమేష్‌రెడ్డి స్విచ్ ఆన్ చేయగా షాక్ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందారు. తండ్రి ఈశ్వరరెడ్డి, బంధువులు బోరున విలపించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉండగా, ఒకరు అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా, మరొకరు హైదరాబాద్‌లోని ఓ కంపెనీలో పనిచేస్తున్నారు. తొండూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రమేష్‌రెడ్డి మృతి విషయం తెలుసుకున్న కడప ఎంపీ వైఎస్.అవినాష్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌ఛార్జి వైఎస్.మధురెడ్డి, క్రిష్ణంగారిపల్లె గ్రామానికి చేరుకుని రమేష్‌రెడ్డి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రవీంద్రారెడ్డి, రామమునిరెడ్డి, సురేష్‌రెడ్డి, శివశంకర్‌రెడ్డి, రమణారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

కడప, నెల్లూరు జట్ల విజయం


నాగకుల్లాయప్ప (4 వికెట్లు)


రోహిత్ వర్మ (68 పరుగులు)


భువనేశ్వర్ (63 పరుగులు)

కడప వైఎస్ఆర్ సర్కిల్ : జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగే ఏసీఏ సౌత్ జోన్ అండర్–19 వన్డే క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా బుధవారం వైయస్ రాజారెడ్డి ఏసీఏ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో కర్నూలు జట్టుపై కడప జట్టు ఘనవిజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన కర్నూలు జట్టు 50 ఓవర్లలో తొమ్మిది వికెట్ల నష్టానికి 204 పరుగులు చేసింది. జట్టులోని మురారి హృదయ్ 66 పరుగులు చేశారు. కడప జట్టులో నాగకుల్లాయప్ప నాలుగు వికెట్లు తీసుకున్నాడు. కడప జట్టు బ్యాటింగ్ ప్రారంభానికి ముందు వర్షం కారణంగా అంపైర్లు ఓవర్లను కుదించారు. వీజేడీ పద్ధతి ప్రకారం 37 ఓవర్లలో 164 పరుగుల టార్గెట్ నిర్ణయించారు. అనంతరం 164 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన కడప జట్టు 30.5 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 165 పరుగులు చేసి 8 వికెట్ల తేడాతో విజయం సాధించింది. కడప జట్టులోని రోహిత్ వర్మ 68, రణధీర్ రెడ్డి 55 (నాటౌట్) పరుగులు చేశారు. విజయం సాధించిన నెల్లూరు జట్టు..

కెఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో జరిగిన మ్యాచ్‌లో అనంతపురం జట్టుపై మూడు వికెట్ల తేడాతో నెల్లూరు జట్టు విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం జట్టు 47.3 ఓవర్లలో 240 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. ఆ జట్టులోని భువనేశ్వర్ 63, మనోజ్ కుమార్ 43 పరుగులు చేశారు. నెల్లూరు జట్టు బ్యాటింగ్ ప్రారంభానికి ముందు వర్షం కారణంగా అంపైర్లు విజేడీ పద్ధతి ప్రకారం మ్యాచ్‌ను 47 ఓవర్లకు కుదించారు. 224 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన నెల్లూరు జట్టు 35.5 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 224 పరుగులు చేసి 3 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఆ జట్టులోని కారుణ్య ప్రసాద్ 50, మన్విత్ 44 పరుగులు చేశారు. అనంతపురం జట్టులోని సాయి ప్రతాప్ రెడ్డి 3, వీరారెడ్డి 2 వికెట్లు తీసుకున్నారు.

హౌసింగ్ బోర్డు చోరీ కేసులో పురోగతి


చోరీ కేసులో రికవరీ చేసిన బంగారు నగలతో సీఐ, ఎస్ఐలు

ప్రొద్దుటూరు క్రైం: ప్రొద్దుటూరు హౌసింగ్ బోర్డు కాలనీలో జరిగిన చోరీ కేసులో టూటౌన్ పోలీసులు పురోగతి సాధించారు. బుధవారం రాత్రి సీఐ సదాశివయ్య కేసు వివరాలను మీడియాకు తెలిపారు. హౌసింగ్‌బోర్డు కాలనీలోని గోపిరెడ్డి శివశంకర్‌రెడ్డి ఇంట్లో ఈ ఏడాది మార్చి 15న చోరీ జరిగిన విషయం తెలిసిందే. ఇంట్లో సుమారు 249 గ్రాముల బంగారు నగలను దొంగలు దోచుకెళ్లారు. ఈ కేసులోని నిందితులు జంగా వెంకటరావు, సుధాకర్‌లను ఇటీవల ఇతర జిల్లా పోలీసులు అరెస్ట్ చేశారు. పీటీ వారెంట్‌పై ఇద్దరినీ ప్రొద్దుటూరు కోర్టులో హాజరుపరిచి, కోర్టు అనుమతి మేరకు పోలీస్ కస్టడీలోకి తీసుకొని ఆభరణాలను రికవరీ చేశారు. వీటిలో కొంత బంగారాన్ని నిందితులు విక్రయించారు. బద్వేల్ సమీపంలోని అటవీ ప్రాంతంలో దాచిన మిగిలిన 180 గ్రాముల బంగారు నగలను స్వాధీనం చేసుకున్నారు. అలాగే చిన్నచౌక్ పరిధిలో జరిగిన చోరీకి సంబంధించిన బంగారు నగలను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. కేసు ఛేదించిన సీఐ సదాశివయ్య, ఎస్ఐలు ధనుంజయ, రాఘవేంద్రారెడ్డి, సిబ్బందిని ఎస్పీ అశోక్‌కుమార్, డీఎస్పీ భావన అభినందించారు.

కారు, స్కూటర్ ఢీ – ఇరువురికి గాయాలు

చిన్నమండెం : మండల పరిధిలోని కడప–బెంగళూరు జాతీయ రహదారిపై కారు, బైక్ ఎదురెదురుగా ఢీకొనడంతో ఇరువురికి గాయాలైనట్లు పోలీసులు తెలిపారు. రాయచోటి వైపు నుంచి మదనపల్లి వైపు వెళ్తున్న కారు.. అటుగా వస్తున్న బైక్ ఎదురెదురుగా బుధవారం ఢీకొన్నాయి. స్కూటర్‌లో వెళ్తున్న లావణ్య, నందకుమార్‌లకు గాయాలవగా, క్షతగాత్రులను మదనపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.